క్లుప్తంగా

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కేసులు



టేకుమట్ల: ఫర్టిలైజర్ యజమానులు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కేసులు తప్పవని ఎస్సై చల్ల రాజు అన్నారు. మండలంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలలో ఎస్సై బుధవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు రికార్డులను తనిఖీ చేసి, అనుమతి పత్రాలను పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా నకిలీ విత్తనాలను విక్రయిస్తే షాప్ లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. విత్తనాలు కొన్న ప్రతీ రైతుకు బిల్లు ఇవ్వాలని సూచించారు.

వాహనాల తనిఖీ



మహాముత్తారం: మండలంలోని నిమ్మగూడెం, పెగడపల్లి, యామన్‌పల్లి ప్రధాన రహదారుల్లో ఎస్సై సుధాకర్ ఆధ్వర్యంలో బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఆయా ప్రధాన రహదారులతో పాటు గ్రామాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. వాహన పత్రాలను పరిశీలించి అనుమానితులతో మాట్లాడి వదిలేశారు. మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారం మేరకు తనిఖీలు చేపట్టినట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో సీఆర్పీఎఫ్, సివిల్ పోలీసులు ఉన్నారు.

సన్మానం

చిట్యాల: యూపీఎస్సీ సివిల్స్ ఫలితాల్లో ఆలిండియా 40వ ర్యాంక్ సాధించిన మండలంలోని గుంటూరుపల్లి గ్రామానికి చెందిన సాయి అశ్రిత్‌ను జెడ్పీటీసీ గొర్రెసాగర్ అభినందించారు. ఈ మేరకు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కుంభం క్రాంతికుమార్ రెడ్డి, గుంటూరుపల్లి సర్పంచ్ పువ్వాటి రాణి వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు దమెర రాజు, ఎండీ ఫక్రుద్దిన్ పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలంలోని కొంపల్లితండాలో జరిగిన బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమంలో గండ్ర సత్యనారాయణరావు బుధవారం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు మర్రి కృష్ణమూర్తి, మాజీ ఎంపీటీసీ వంగ శంకర్, నాయకులు సతీష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

టేకుమట్ల (రేగొండ): రేగొండ మండలంలోని లింగాలలో కొనసాగుతున్న భూలక్ష్మీ–మహాలక్ష్మీ, బొడ్రాయి ప్రతిష్ఠాపన వేడుకల్లో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు బుధవారం హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

గుడుంబా స్వాధీనం

మహదేవపూర్: మండల కేంద్రానికి చెందిన బోడ లక్ష్మి ఇంట్లో నిల్వ ఉంచిన గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై భవానిసేన్ తెలిపారు. గుడుంబా విక్రయిస్తున్నట్లు పక్కా సమాచారంతో సోదాలు నిర్వహించామన్నారు. 5 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని లక్ష్మిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ ఉపేంద్ర, పోలీసులు తిరుపతి పాల్గొన్నారు.

ధరణి పోర్టల్ రద్దు చేస్తాం..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సీతక్క



నూతన అధ్యక్షుడిని గజమాలతో సన్మానిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

● ఎమ్మెల్యే సీతక్క

ములుగు రూరల్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులను గోసపెడుతున్న ధరణి పోర్టల్‌ను రద్దు చేస్తామని ఎమ్మెల్యే సీతక్క అన్నారు. ఈ మేరకు బుధవారం నూతన జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ సన్మాన కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ముందుగా గట్టమ్మ తల్లికి నూతన అధ్యక్షుడితో కలిసి ఎమ్మెల్యే సీతక్క ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గట్టమ్మ వద్ద నుంచి బైక్ ర్యాలీ చేపట్టారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ విగ్రహం వద్ద జిల్లా అధ్యక్షుడు అశోక్‌ను కాంగ్రెస్ శ్రేణులు గజమాలతో సన్మానించారు. అనంతరం మండలంలోని ఇంచర్ల శివారులోని ఎంఆర్ గార్డెన్స్‌లో ప్రమాణస్వీకారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి తీసుకువచ్చే విధంగా కార్యకర్తలు కష్టపడి పని చేయాలని అన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో కుటుంబ పాలన రాజ్యమేలుతుందని అన్నారు. ప్రజలకు మాయమాటలు చెప్పి గద్దెనెక్కిన ప్రభుత్వాన్ని గద్దెదించాలని అన్నారు. ఎన్నికలు దగ్గరపడుతుండడంతో సీఎం కేసీఆర్‌కు గృహలక్ష్మీ, పోడు భూములకు పట్టాలు గుర్తుకు వస్తున్నాయని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతులకు రూ.2లక్ష రుణమాఫీని ఏకకాలంలో చేస్తామని అన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర, రూ.5 వందలకు గ్యాస్ సిలిండర్ అందిస్తామని అన్నారు. నిరుద్యోగ భృతి, ఖాళీగా ఉన్న ఉద్యోగల భర్తీ, నిరుపేదల ఇళ్ల నిర్మాణాలకు రూ.5లక్షలు ఇస్తామని అన్నారు. కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పని చేసి రాష్ట్రంలో కాంగ్రెస్ జెండా ఎగరవేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్ గౌడ్, మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, ఆయా మండల అధ్యక్షులు, వర్కింగ్ కమిటీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పీఏసీఎస్ చైర్మన్లు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన సీఎం కేసీఆర్



సమావేశంలో మాట్లాడుతున్న జవహర్‌లాల్

వెంకటాపురం(ఎం): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను సీఎం కేసీఆర్ విస్మరించాడని బీజేపీ మండల అధ్యక్షుడు భూక్య జవహర్‌లాల్ ఆరోపించారు. బుధవారం మండలంలోని కేశవపూర్ గ్రామంలో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజావ్యతిరేక విధానాలతో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టిస్తున్న దొరలపాలనకు చరమగీతం పాడాలన్నారు. మాయ మాటలతో రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన కేసీఆర్ మరోసారి ఎన్నికలు సమీపిస్తున్న వేళ హామీలు ఇవ్వడానికే పరిమితం అవుతున్నారని, గతంలో ఇచ్చిన హామీలను గాలికొందిలేశారన్నారు. ఉద్యోగులు, నిరుద్యోగులు, నిరుపేదలు, రైతుల సమస్యలను పరిష్కరించలేని కేసీఆర్ బీఆర్ఎస్ పేరుతో దేశాన్ని ఉద్ధరించేందుకు సిద్ధమవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని, త్వరలోనే కేసీఆర్ కుటుంబం మూల్యం చెల్లించుకోక తప్పదని అన్నారు. నిరుపేదల సంక్షేమం కోసం దేశం కోసం పనిచేసే నరేంద్ర మోదీ పాలన వస్తేనే తెలంగాణ రాష్ట్రం బాగుపడుతుందని అన్నారు. ఈ సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి గూడెపు సంతోష్, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల రమేష్, గిరిజన మోర్చా మండల అధ్యక్షులు బెల్లంకొండ వినోద్, కేశవాపూర్ బూత్ అధ్యక్షులు పైడాకుల మల్లేష్, పచ్చిమట్ల తిరుపతి, బీజేవైఎం ప్రధాన కార్యదర్శి వంశీ, బావ్‌సింగ్‌పల్లి గ్రామ కమిటీ సభ్యులు నవీన్, రాజు పాల్గొన్నారు.

చెక్కు అందజేత

కాటారం: కాటారం మండలం వీరాపూర్‌కు చెందిన వెనగంటి వనిత పేరిట ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై) ద్వారా మంజూరైన బీమా చెక్కును బుధవారం స్థానిక ఎస్బీఐ మేనేజర్ వెంకన్న లబ్ధిదారురాలికి అందజేశారు. వనిత భర్త తిరుపతి స్థానిక ఎస్బీఐలో పీఎంజేజేబీవై లబ్ధిదారుడిగా నమోదు చేసుకున్నారు. తిరుపతి ఇటీవల మృతి చెందడంతో పథకం ద్వారా క్లెయిమ్ అయిన రూ.2లక్షలను నామినిగా ఉన్న భార్య వనితకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ వెంకన్నతో పాటు సిబ్బంది విజయ్, కార్తీక్, సాయిరాం, లక్ష్మణ్, ఆకాశ్, కరుణాకర్ పాల్గొన్నారు.

అప్పు కింద చూసుకుంటే ఊరుకోం..



మాట్లాడుతున్న వెంకన్న, రఘు

ఏటూరునాగారం: కల్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కుల ద్వారా నూతన వధువు తల్లిదండ్రులకు వచ్చే డబ్బులను బ్యాంక్ అధికారులు అప్పుల కింద జమ కట్టుకుంటే ఊరుకునేది లేదని కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కొంత మంది బ్యాంక్ అధికారులు మహిళా పొదుపు సంఘాల పాత బకాయిల అప్పు పేరుతో కల్యాణలక్ష్మి కింద చెక్కులు జమైనా డబ్బులను ఆపడం సరికాదన్నారు. ఆడపిల్ల పెళ్లి చేసేందుకు వారి తల్లిదండ్రులు అప్పులు చేసి వివాహం జరిపిస్తే ప్రభుత్వం ఇచ్చిన నగదును బ్యాంకు అధికారులు అప్పు కింద తీసుకోవడం బాధాకరం అన్నారు. ఈ సమావేశంలో జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎండీ అయూబ్ ఖాన్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చెన్నూరి బాలరాజు, ఎంపీటీసీ గుడ్ల శ్రీలత దేవేందర్, నాయకులు ఖలీల్ ఖాన్, వావిలాల నర్సింహారావు, వావిలాల చిన్న ఎల్లయ్య, మహిళా మండల అధ్యక్షురాలు, ఉపసర్పంచ్ కర్ల అరుణ, అధికార ప్రతినిధి ముక్కెర లాలయ్య , జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి కొండగొర్ల పోషయ్య, మండల కిసాన్ సెల్ అధ్యక్షులు సోదారి రామయ్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జోంగిరి మధుబాబు, పీఏసీఎస్ డైరెక్టర్ వంగపండ్ల రవి, గౌస్, శ్రీను, సులేమాన్, రాంబాబు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు చేయించుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి అల్లెం అప్పయ్య



అవినాష్‌ను సన్మానిస్తున్న వైద్యులు

ఏటూరునాగారం: అనారోగ్య సమస్యలుంటే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని డీఎంహెచ్ఓ అల్లెం అప్పయ్య అన్నారు. ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రిలో మూడు రోజుల పాటు ప్రతిమ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరం బుధవారంతో ముగిసింది. ఈ మేరకు నిర్వహించిన సమావేశంలో అప్పయ్య మాట్లాడారు. 40 ఏళ్లు దాటిన పురుషులు, స్త్రీలు బీపీ, షుగర్‌తో పాటు ఇతర రోగాల పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ వైద్య శిబిరంలో వరంగల్ ప్రతిమ కేన్సర్ ఇనిస్టిట్యూట్ వైద్యులు అవినాష్, సుమిత్ర, డిప్యూటీ డీఎంహెచ్ఓ విపిన్, డాక్టర్ విపిన్, ఐటీడీఏ డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ క్రాంతి కుమార్, సామాజిక వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సురేష్ కుమార్, ప్రోగ్రాం వైద్యాధికారులు డాక్టర్ వెంకటేశ్వరరావు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సంబంధించిన వైద్యాధికారులు ఈ యొక్క కార్యక్రమంలో సేవలు అందించినట్లు తెలిపారు.

మెగా శిబిరంలో 549 మందికి పరీక్షలు

ప్రతిమ కేన్సర్ ఇనిస్టిట్యూట్ ప్రత్యేక డాక్టర్ అవినాష్ మాట్లాడుతూ.. మూడు రోజుల వైద్య శిబిరంలో 549 మంది అవుట్ పేషెంట్లకు పరీక్షలు చేశామన్నారు. ఇందులో రొమ్ము క్యాన్సర్, గర్భాశయ నిర్ధారణ పాప్ స్మియర్, ఎఫ్ఎన్ఏసీ సూది, అల్ట్రా సౌండ్ స్కానింగ్ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కేన్సర్‌తో చికిత్స పొందుతున్న పేషంట్లు పదిమందిని పాత రోగులను పరిశీలించామన్నారు. కొత్తగా 11 మందికి కేన్సర్ కేసెస్ ఉన్నట్లుగా నిర్ధారించినట్లు తెలిపారు. అనంతరం ప్రతిమ ఆస్పత్రి వైద్యులను సన్మానించారు.ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ నవ్య, డాక్టర్ అజయ్ రత్నం, డాక్టర్ సూర్య, డాక్టర్ అంకిత్, టీం మేనేజర్ షౌకత్ అలీ, అసిస్టెంట్ మేనేజర్ మహంతి, డాక్టర్ భవ్య, డాక్టర్ సుమలత, వై నాగదేవి, శారద, వినోద్, రాము, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు



జీలుగ విత్తనాలను పరిశీలిస్తున్న ఏఓ

వాజేడు: స్థానిక సహకార సంఘంలో అమ్మకానికి జీలుగ విత్తనాలు సిద్ధంగా ఉన్నట్లు మండల వ్యవసాయాధికారి గుంటుక నర్సింహరావు తెలిపారు. సహకార సంఘానికి వచ్చిన 332 బస్తాల జీలుగులను బుధవారం వ్యవసాయాధికారి పరిశీలించి మాట్లాడారు. 30 కేజీల జీలుగ బస్తా ధర రూ 843 ఉన్నట్లు తెలిపారు. కావాల్సిన రైతులు ఆధార్, పట్టా పాస్ బుక్ జిరాక్స్ తీసుకుని సహకార సంఘంలో గాని లేదా వ్యవసాయ విస్తరనాధికారిని గాని కలవాలన్నారు. రైతులు సకాలంలో పొలాల్లో, చేలల్లో జీలుగు విత్తనాలను చల్లుకోవాలని సూచించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



మల్హర్: నివాళులర్పిస్తున్న పుట్ట మధు

మల్హర్: మండలంలోని కొయ్యూరు గ్రామానికి చెందిన గౌస్ మోహిద్ పాషా అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందాడు. దీంతో పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు, బీఆర్ఎస్ పార్టీ జిల్లా యువజన నాయకుడు జక్కు రాకేష్ బుధవారం గౌస్ మోహిద్ పాషా మృతదేహానికి నివాళులర్పించి, సంతాపం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కుంభం రాఘవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మల్క సూర్యప్రకాశ్‌రావు, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు గోనె శ్రీనివారావు, మహిళ మండల అధ్యక్షురాలు పంతకాని చంద్రకళ, మండల కోఆప్షన్ సభ్యుడు అయ్యూబ్‌ఖాన్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు లింగమూర్తి, నాయకులు యాదగిరిరావు, బూడిద మల్లేష్, సర్పంచ్‌లు విజయ నాగేశ్వర్‌రావు, కుమారస్వామి, రాజేశ్వరి కత్తెరశాల, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బియ్యం అందజేత

పలిమెల: మండలంలోని ముకునూరు గ్రామానికి చెందిన కొరం చిన్నక్క ఇటీవల మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని బుధవారం బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. పుట్ట మధు ఆదేశాల మేరకు బాధిత కుటుంబానికి బియ్యం, నిత్యావసర సరుకులు, ఆర్థిక సాయం అందజేసినట్లు సర్పంచ్ ఆలం సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుధాకర్, శ్రీను, సురేందర్, కనకయ్య, సమ్మయ్య, నగేష్ పాల్గొన్నారు.

పెసా గ్రామసభలు



కొండాపురంలో సభ నిర్వహిస్తున్న అధికారులు

వెకటాపురం(కె): మండల పరిధిలోని సూరవీడు పంచాయతీలోని కొండాపురం, కె కొండాపురం, శ్రీ రంగాపురం గ్రామాల్లో ఇసుక నిర్వహణ కోసం బుధవారం పెసా గ్రామ సభలను సర్పంచ్ కుంజా గంగా అధ్యక్షతన అధికారులు నిర్వహించారు. కొండాపురం ఇసుక రీచ్ నిర్వహణను కొండాపురం మహిళ గిరిజన ఇసుక సొసైటీకి, కె కొండాపురం ఇసుక రీచ్ నిర్వహణను వరసిద్ధి వినాయక ఆదివాసీ లేబర్ కాంట్రాక్టు సొసైటీకి, శ్రీ రంగాపురం ఇసుక రీచ్ నిర్వహణను ముత్యాలమ్మ ఆదివాసీ గిరిజన సొసైటీ నిర్వహించేందుకు గ్రామ సభలో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అడ్డూరి బాబు, పెసా కమిటీ జిల్లా కోఆర్డినేటర్ కొమరం ప్రభాకర్, సభ్యులు తదితరులు ఉన్నారు.

గిరిజనుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



విరాళం అందిస్తున్న ఎమ్మెల్యే గండ్ర దంపతులు

భూపాలపల్లి రూరల్: గిరిజనుల సంక్షేమమే బీఆర్ఎస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం భూపాలపల్లి మండలంలోని కొంపల్లితండాలో శ్రీ భూలక్ష్మీ, మహాలక్ష్మీ గ్రామదేవతల బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలకు ఎమ్మెల్యే గండ్ర దంపతులు హాజరై పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలోని తండాలను బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా చేసి పరిపాలన సౌలభ్యాన్ని కల్పించినట్లు తెలిపారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం గిరిజన లంబాడీలకు రిజర్వేషన్లు కల్పించడంలో పూర్తిగా వైఫల్యం చెందినప్పటికీ శాసనసభలో గిరిజనుల పక్షాన పోరాడి 10శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. అనంతరం ఉత్సవాలకు రూ.25వేలను విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాసగాని కవిత దేవేందర్, ఎంపీటీసీ పాతూరి సంధ్య దేవేందర్, ప్రజా ప్రతినిధులు బీఆర్ఎస్ పార్టీ నాయకులు గ్రామప్రజలు పాల్గొన్నారు.

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని లింగాలలో కొనసాగుతున్న భూలక్ష్మీ–మహాలక్ష్మీ, బొడ్రాయి ప్రతిష్ఠాపన వేడుకల్లో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి బుధవారం పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వారి వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

టెండర్లతో ఆలయానికి ఆదాయం



టెండర్లు నిర్వహిస్తున్న అధికారులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయానికి వివిధ టెండర్ల ద్వారా ఆదాయం సమకూరినట్లు ఈఓ మహేష్, దేవస్థానం చైర్మన్ లింగంపల్లి శ్రీనివాసరావులు తెలిపారు. దేవస్థానం కార్యాలయంలో బుధవారం టెండర్లు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు వివరాలు వెల్లడించారు. మాన్యం భూమికి కౌలు రూ.1.80 లక్షలకు అంబట్‌పల్లి గ్రామానికి చెందిన నారం రాంబాబు, కిరాణం, జనరల్ స్టోర్ నిర్వహణకు నెలకు రూ.6వేల చొప్పున ముదురుకోళ్ల సమ్మయ్య ఒక సంవత్సరానికి గాను హక్కులు పొందినట్లు తెలిపారు. సెల్‌ఫోను భద్రపరుచు టెండరు కు సరైన పాట రానందున వాయిదా వేసినట్లు ఈ ఓ, చైర్మన్‌లు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీటీసీ మమత, ధర్మకర్తలు సమ్మయ్య, రాంరెడ్డి, రాజయ్య, పద్మ, శ్యాంసుందర్, దేవేందర్ పాల్గొన్నారు.

చైర్మన్ చొరవతో..

గత కొన్ని రోజులుగా నిరుపయోగంగా పిచ్చి మొక్కలు, చెట్లతో ఏపుగా పెరిగి వెక్కిరించాయి. నూతనంగా నియామకమైన పాలకమండలి భూమిని చదును చేశారు. ప్రస్తుతం గుడి మాన్యం భూమిని చైర్మన్ లింగంపల్లి శ్రీనివాసరావు, ధర్మకర్తల ప్రత్యేక చొరవతో ఉపయోగంలోకి తీసుకువచ్చారు. దీంతో మాన్యం భూమికి సంవత్సరానికి కౌలు రూ. 1.80లక్షలు ఈ ఏడాది ఆదాయం సమకూరింది. దీంతో చైర్మన్, ధర్మకర్తలను భక్తులు, గ్రామస్తులు కొనియాడుతున్నారు. ఆలయంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతున్నారు.

భూమి పూజ



భూమి పూజ చేస్తున్న గ్రామస్తులు

వాజేడు: మండల కేంద్రంలో బొడ్రాయిని ఏర్పాటు చేయడం కోసం బుధవారం శంకుస్థాపన చేశారు. గ్రామంలో బొడ్రాయి, ఆంజనేయ స్వామి విగ్రహం , ముత్యాలమ్మ విగ్రహాలను ఏర్పాటు కోసం గ్రామస్తులు ముందుగా భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు.

జిల్లాస్థాయి పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ



రాష్ట్ర స్థాయికి ఎంపికైన రేగొండ బాక్సర్లకు మెడల్స్ అందజేస్తున్న కలెక్టర్

టేకుమట్ల(రేగొండ): జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన సీఎం కప్ జిల్లా స్థాయి బాక్సింగ్ క్రీడలో రేగొండ మండలానికి చెందిన బాక్సింగ్ క్రీడాకారులు రాకేష్, శివక్రిష్ణ, వినోద్, శేఖర్‌లు గోల్డ్ మెడల్ సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు కలెక్టర్ భవేష్‌మిశ్రా, డీవైఎస్ఓ సునీత గోల్డ్‌మెడల్స్, ప్రశంస పత్రాలతో పాటు జ్ఞాపికలను అందజేశారు. అలాగే బాక్సింగ్ క్రీడాకారులకు బాక్సింగ్‌లో తర్ఫీదునందించిన రేగొండ మండలంలోని రంగయ్యపల్లి ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు రఘుకు ప్రశంస పత్రంతో పాటు జ్ఞాపికను అందించి, ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సురేందర్, సపాకల రాజయ్య, తదితరులు ఉన్నారు.

కాటారం: సీఎం కప్ 2023 క్రీడా పోటీల్లో భాగంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో కాటారం క్రీడాకారులు పలు విభాగాల్లో సత్తా చాటారు. ఖోఖో విభాగంలో మహాముత్తారం మండలంపై కాటారం జట్టు క్రీడాకారులు అత్యుత్తమ ఆట ప్రదర్శించి ప్రథమ స్థానంలో నిలిచారు. అథ్లెటిక్స్ క్రీడల్లో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం కైవసం చేసుకొన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణిరాకేశ్, ఎంపీపీ పంతకాని సమ్మయ్య, ఎంపీడీఓ శంకర్ నాయక్ ప్రత్యేకంగా అభినందించారు.



కాటారం: ప్రతిభ కనబర్చిన మండల క్రీడాకారులు



గెలుపొందిన పలిమెల వాలీబాల్ జట్టు

వాలీబాల్ పోటీలో పలిమెల విజయం

పలిమెల: భూపాలపల్లి జిల్లా కేంద్రంలో జరుగుతున్న సీఎం కప్ జిల్లా స్థాయి పోటీలలో పలిమెల మండల వాలీబాల్ జట్టు విజేతగా నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికై నట్లు ఎంపీడీఓ ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికై న మండల వాలీబాల్ జట్టును ఆయన అభినందించారు. రాష్ట్ర స్థాయిలో కూడా ఉత్తమ ప్రదర్శన కనబర్చి విజేతలుగా నిలవాలని కోరారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడా సామగ్రి అందజేస్తున్న పోలీసులు

పలిమెల: క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం పెంపొందుతాయని పలిమెల ఎస్సై అరుణ్, ఎస్సై 2 శివకుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని బూరుగుగూడెం గ్రామంలోని యువతకు క్రీడా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. క్రీడల్లో మెరుగైన ప్రదర్శన కనబర్చి పలువురికి ఆదర్శకంగా నిలవాలని సూచించారు.